ప్రజాశక్తి

ఆదివారం 22 డిసెంబర్ 2024 5

శ్రీ సత్యసాయి





వైవిఆర్ ప్రాజెక్టు అధ్యక్ష, ఉపాధ్యక్షులు

ప్రాజెక్టు కమిటీ ఎన్నికలూ ఏకగ్రీవమే..!

◆ టిబిసి ఛైర్మన్ పదవి కడప జిల్లా నేతలకే..

◆ వైస్ ఛైర్మన్‌తో సర్దుకున్న అనంత నేతలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ప్రాజెక్టు కమిటీ ఎన్నికలూ ఏకగ్రీవం అయ్యాయి. శనివారం జరిగిన ఈ ఎన్నికలు ప్రశాంతంగానూ సాగాయి. ఎప్పటిలాగానే ఈసారి కూడా కడప జిల్లాకే ఛైర్మన్ పదవి దక్కింది. వైస్ ఛైర్మన్‌తో అనంతపురం జిల్లా నేతలు సరిపెట్టుకున్నారు. శనివారం ఉదయం అనంతపురం నగరంలోని హెచ్‌ఎల్‌సి కార్యాలయంలో ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు జరిగాయి. 12 డిస్ట్రిబ్యూటరీల అధ్యక్షులు కలిసి ఎన్నుకునే ఈ ఎన్నికల్లో అనంతపురం జిల్లా నుంచి ఐదు డిస్ట్రిబ్యూటరీల అధ్యక్షులు, కడప జిల్లా నుంచి ఆరుగురు డిస్ట్రిబ్యూటరీల అధ్యక్షులు, ఆలూరు డిస్ట్రిబ్యూటరీ నుంచి ఒకరు ఎన్నికలో సభ్యులుగా ఉన్నారు. అధ్యక్ష పదవిని ఈసారి ఎలాగైన దక్కించుకోవాలని అనంతపురం జిల్లా నేతలు పోటీపడ్డారు. హెచ్‌ఎల్‌ఎంసి డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షులు కేశవరెడ్డి, అటు కడప జిల్లా నుంచి కసనూరు డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షులు మారెడ్డి జోగిరెడ్డి పోటీపడ్డారు. ఇటు వైపు నుంచి కాలవ శ్రీనివాసులు ప్రయత్నించగా, అటు బిటెక్ రవి ప్రయత్నించారు. ఇద్దరి మధ్య పోటీ ఉండే అవకాశముందని భావించారు. అయితే అధిష్టానం నుంచి వచ్చిన సంకేతాల అనుగుణంగా పోటీని నివారించడంలో భాగంగా కడప జిల్లాకు చెందిన కసనూరు డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షులు మారెడ్డి జోగిరెడ్డికి అధ్యక్ష పదవిని ఇవ్వాలని నిర్ణయించారు. కేశవరెడ్డికి వైస్ ఛైర్మన్ పదవి ఇచ్చే విధంగా ఒప్పందం చేసుకున్నారు. దీని ప్రకారమే శనివారం జరిగిన ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేశారు. పోటీ లేకపోవడంతో మారెడ్డి జోగిరెడ్డి అధ్యక్షుడిగానూ, కేశవరెడ్డి ఉపాధ్యక్షుడిగానూ ఎన్నికైనట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన హెచ్‌ఎల్‌సి ఎస్‌ఇ రాజశేఖర్ ధ్రువీకరించారు.

వైఎస్ జగన్‌కు వ్యతిరేకంగా రాజకీయం చేస్తున్నాం : బిటెక్ రవి

'మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌కు వ్యతిరేకంగా ఆయన సొంత ప్రాంతంలో రాజకీయం చేస్తున్నాం.. మాకు రాష్ట్ర స్థాయి మద్దతు కావాలి' అని టిడిపి నాయకులు బీటెక్ రవి పేర్కొన్నారు. హెచ్‌ఎల్‌సి ప్రాజెక్టు ఎన్నికల సందర్భంగా ఆయన మద్దతుగా ఇక్కడి విచ్చేశారు. ఎన్నిక అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నీటి విలువ తెలిసిన వాళ్లం.. చివరి ఆయకట్టు వరకు నీళ్లు అందించే విధంగా కృషి చేస్తామని చెప్పారు. కడప జిల్లాలో 32 సాగునీటి సంఘాలను టిడిపి కైవసం చేసుకుందని తెలిపారు.

భైరవానితిప్పకు ఏకగ్రీవం

గుమ్మఘట్ట : భైరవానితిప్ప ప్రాజెక్టు ఎన్నికలూ ఏకగ్రీవమయ్యాయి. కలుగోడు డిస్ట్రిబ్యూటరీల అధ్యక్షులుగా కాలవ నాగరాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బుడిమేపల్లి డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షులు సుబహాన్ ఎన్నికయ్యారు. వీరికి ప్రభుత్వం విప్, రాయదుర్గం కాలవ శ్రీనివాసులు నియామక పత్రాలను అందించారు.

వైవిఆర్ ప్రాజెక్టు ఛైర్మన్‌గా జయప్రకాశ్


ముదిగుబ్బ : మండలంలోని వైవిఆర్ ప్రాజెక్టు ఛైర్మన్ ఎన్నిక ఏకగ్రీవమైంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ఛైర్మన్‌గా గోడి జయప్రకాశ్ నాయుడు, వైస్ ఛైర్మన్‌గా శివయ్యలు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మురళి ధ్రువీకరించారు. వీరిని టీడీపీ నాయకులు ప్రభాకర్, తుమ్మల మనోహర్ నాయుడు అభినందించారు.

నేటి నుంచి ఆర్డీటీ గ్రౌండ్‌లో..

అండర్-19 క్రికెట్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం వేదికగా బీసీసీఐ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా అండర్-19 కూచ్ బెహర్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఆదివారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఆంధ్ర, మహారాష్ట్ర జట్లు తలపడే ఈ మ్యాచ్ ఆదివారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభం అవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే ఇరు రాష్ట్రాల జట్లు అనంతపురంలోని ఆర్డీటీ స్పోర్ట్స్ అకాడమీకి చేరుకుని ముమ్మరంగా సాధన చేశారు. మ్యాచ్ నిర్వహణకు సంబంధించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా అవసరమైన చర్యలు తీసుకున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి సానా సతీష్ బాబు వెల్లడించారు.





మృతి చెందిన చిన్నారి అధర్వ



రత్నమ్మ



మనోజ్

విషాదాంతం..!

కుమారుని కేశఖండన నిమిత్తం బంధువులతో కలిసి ఎంతో సంతోషంగా తిరుపతికి వెళ్లారు. అందరూ ఎంతో సంతోషంగా గడుపుతూ మూడేళ్ల తన కుమారునికి వెంకన్న సన్నిధిలో తలనీలాలు సమర్పించారు. దైవర్శనం అనంతరం తిరుగుప్రయాణంలో ఇంటికి బయల్దేరారు. వాహనంలో కూర్చొన్న అందరూ బంధువులు కావడంతో రాత్రంతా సరదాగా కబుర్లు చెప్పకున్నారు. మరో గంట సేపులో స్వగ్రామం చేరేలోపు వారి ప్రయాణం విషాదాంతం అయ్యింది. వీరు ప్రయాణిస్తున్న ఐచర్ వాహనం ఆగి ఉన్న లారీ ఢీకొనడంతో నలుగురు అక్కడికక్కడే మరణించారు. పది మంది గాయపడ్డారు. మడకశిర మండలం బుల్లసముద్రం వద్ద శనివారం వేకువజామును 5 గంటలకు జరిగిన ఈ ప్రమాదం పలు కుటుంబాల్లో చీకట్లను మిగిల్చింది.

◆ మడకశిర వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

◆ లారీని ఢీకొన్న టెంపోట్రావెలర్ వాహనం

◆ నలుగురి మృతి ◆ 10 మందికి గాయాలు

◆ మృతులంతా బంధువులు ◆ శోకసంద్రంలో కెఎన్.పల్లి

ప్రజాశక్తి-మడకశిర, గుడిబండ

మడకశిర నియోజకవర్గం అమరాపురం, గుడిబండ మండలం కెఎన్.పల్లి గ్రామానికి రిటైర్డ్ టీచర్ దాసేగౌడ్ కుటుంబ సభ్యులు, బంధువులు ఈ నెల 19వ తేదీ తిరుపతికి వెళ్లారు. కెఎన్.పల్లికి చెందిన ప్రేమకుమారి, శివరాజ్‌ల కుమారుడు అతర్వ(4సం॥) కేశఖండన నిమిత్తం వీరంతా రెండు వాహనాల్లో తిరుపతికి వెళ్లారు. కేశఖండన, దైవర్శనం అనంతరం శుక్రవారం రాత్రి రెండు వాహనాల్లో స్వగ్రామానికి బయళ్దేరారు. శనివారం వేకువజామున 5 గంటలకు వారు ప్రయాణిస్తున్న టెంపొట్రావెల్ మడకశిర మండలం బుల్లసముద్రం వద్దకు రాగానే రోడ్డు పక్కన ఆపి ఉంచిన లారీని వేగంగా వచ్చి ఢీకొంది. తుఫాన్ వాహనంలో ఉన్న తల్లీకుమారుడు ప్రేమకుమారి(30), అధర్వ(4), అమరాపురానికి చెందిన రత్నమ్మ(68), కర్నాటకకు చెందిన డ్రైవర్ మనోజ్(32) ఘటనా స్థలంలో మరణించారు. వీరితో పాటు కెంపన్న, కెంచమ్మ, గీత లక్ష్మి, సుజాతమ్మ, గిరిజమ్మ, నాగమణి, ఉష, అమాజమ్మ, శ్రీదేవి, శ్వేతలు గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో ప్రమాద విషయం తెలియగానే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో ఉపాధ్యాయురాలు సజాత, గిరిజమ్మ, శ్రీదేవి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బెంగుళూరుకు తరలించారు. వీరితో పాటు మరికొందరిని హిందూపురం ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన వారికి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

శోకసంద్రంలో కెఎన్.పల్లి

బుల్లసముద్రం గ్రామం సమీపంలో జరిగిన ప్రమాదంలో కెఎన్.పల్లి గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ప్రేమ కుమారి ఆమె కుమారుడు అతర్వ (4) సమీప బంధువు రత్నమ్మ మరణించారు. కేశఖండన నిమిత్తం వెళ్లిన వారు అనుకోని ప్రమాదంలో మృతి చెందడంతో కెఎన్.పల్లి గ్రామంలో విషాద ఛాయలు అలము కున్నాయి. తల్లీకుమారుడు మృతదేహాలను చూసి పలువురు కన్నీటి పర్యవంతం అయ్యారు.

ఘటనపై మంత్రి సవిత దిగ్భ్రాంతి

మడకశిర వద్ద రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మడకశిర ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు ఫోన్ ద్వారా తెలియజేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రమాద విషయం తెలుసుకున్న పలువురు రాజకీయ పార్టీ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను మడకశిర ఆసుపత్రిలో పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే ఈరన్న, రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు, గుడిబండ జెడ్పిటిసీ పోతరాజు, తెలుగుదేశం పార్టీ జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి గుండుమల రాధాకష్ణ తదితరులు పరామర్శించి ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. మృతులు గాయపడిన వారు టిడిపి రైతు సంఘం నాయకులు సురేష్ బంధువులు కావడంతో టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రికి వచ్చి బాధితులను పరామర్శించారు. సిడబ్ల్యుసి సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం అత్యంత విచాకరం అన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఘటనా స్థలానిన ఎస్పీ పరిశీలన

ప్రమాదం జరిగిన బుల్లసముద్రం రోడ్డు ప్రాంతాన్ని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను పోలీసులు, స్థానికులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మడకశిర ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆమె వెంట పెనుగొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, మడకశిర సిఐ రాజకుమార్, రాగిరి రామయ్య ఉన్నారు.



మడకశిరలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎస్పీ వి.రత్న

వైసిపిలో ఆగని ఆధిపత్య పోరు...!



తన కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న నవీన్ నిశ్చల్



వైసిపి కార్యాలయం వద్ద చీరలు పంపిణీ చేసిన మహిళతో దీపిక, వైసిపి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం వైసిపిలో ఆధిపత్యం పోరు ఆగడం లేదు. తమ పార్టీ అధినేత జన్మదిన వేడుకల నిర్వహణలోనూ మరోసారి విబేధాలు తేటతెల్లం అయ్యాయి. మాజీ ఆగ్రోస్ ఛైర్మన్ నవీన్ నిశ్చల్ ఆధ్వర్యంలో తన పార్టీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు నడుమ పార్టీ జగన్మోహన్ రెడ్డి

వేర్వేరుగా అధినేత జన్మదిన వేడుకలు

జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ బొమ్మలు కలిగిన పెద్ద పార్టీ బెలూన్లను గాలిలోకి వదిలి జగన్మోహన్ రెడ్డికి జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. వైసిపి సామాజిక మాధ్యమ కార్యకర్తలకు సూట్ కేసులను బహుమతిగా అందజేశారు. ఇక నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపికా వేణురెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద భారీ కేక్ ను కట్ చేశారు. 2000 మంది మహిళలకు చీరలను పంపిణీ చేశారు. వీరితో పాటు డెలిగెట్ మున్సిపల్ ఛైర్మన్ గా వ్యవహరిస్తున్న బలరామిరెడ్డి సైతం వేరుగా అధినేత జన్మదిన వేడుకలు నిర్వహించారు. బలరామిరెడ్డి గతంలో పార్టీపరంగా జరిగిన కార్యక్రమాల్లో పై రెండు వర్గాల్లో ఏదో ఒక వర్గంతో కలిసి పాల్గొనేవారు. తాజాగా అయనే సొంతంగా కార్యక్రమం నిర్వహించారు. వైసిపిలో ఎవరికి వారు ఇలా గ్రూపులుగా విడిపోయి కార్యక్రమాలు చేస్తుండడంతో కార్యకర్తలో అయోమయం నెలకొంది.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సంఘం శ్రీనివాసులు

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

కమిషనర్ సంఘం శ్రీనివాసులు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఆయా విభాగాల సెక్రటరీలు వారి పరిధిలో విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని కమిషనర్ సంఘం శ్రీనివాసులు హెచ్చరించారు. పన్నుల వసూళ్లలో వెనుకబడిన సచివాలయాల సెక్రెటరీలతో శనివారం సచివాలయాల వారీగా సమీక్ష సమావేశాన్ని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి, నీటి, ఖాళీ జాగా పన్నుల వసూళ్లు పూర్తి స్థాయిలో జరగాలన్నారు. అందరిని సమన్వయం చేసుకుని ఇందులో లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. సమీక్షా సమావేశంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు రాము, రామంజినేయులు, జకావుల్లా పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వీయ క్రమశిక్షణ అవసరం

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు దీర్ఘకాలిక విజయాలు సాధించాలంటే స్వీయ క్రమశిక్షణ ఎంతో అవసరమని వక్తలు పేర్కొన్నారు. శనివారం హిందూపురం రూరల్ మండల పరిధిలోని బిట్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ప్రేరణాత్మక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన వీడీఎం ఇండియా వ్యవస్థాపకులు ఆచార్య అజిత్ కుమార్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు దీర్ఘకాలిక విజయాన్ని సాధించడంలో స్వీయ-క్రమశిక్షణ అవసరం అన్నారు. విద్యార్థులు విజ్ఞానాన్ని తమ లక్ష్య సాధనకు, దేశ అభివద్ధికి ఉపయోగించాలని తెలిపారు. అనంతరం వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే మెరిట్ స్కాలర్‌షిప్ గోడపత్రికలను ఆచార్య అజిత్ కుమార్, శిక్షణ తరగతుల రాష్ట్ర పరిశీలకులు గంగిరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, ఉపాధ్యాయ శిక్షణా తరగతుల ఇన్‌ఛార్జి బాబా ఫక్రుద్దీన్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా॥ఎ.రమేశ్, విభాగాధిపతులు సుదర్శన్ రాజు, దయానంద్, సయ్యద్ నాసిర్, గంగాధర్, మాధురి, యశోద పాల్గొన్నారు.



గోడపత్రికలను విడుదల చేస్తున్న అధ్యాపకులు

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం



సమావేశంలో పాల్గొన్న ఎంపీ, మంత్రి, ప్రజా ప్రతినిధులు

దిశా ఛైర్మన్, ఎంపీ బికె.పార్థసారథి

మంత్రి సవిత

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషిచేసి సత్యసాయి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దామని దిశా ఛైర్మన్, హిందూపురం పార్లమెంటు సభ్యుడు బికె.పార్థసారథి తెలియజేశారు. శనివారం కలెక్టరేట్లో జిల్లా అభివద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని ఎంపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, కలెక్టర్ టిఎస్.చేతన్, ఉమ్మడి జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, జెడ్పీ సీఈవో వెంకటసుబ్బయ్య, కమిటీ సభ్యులు చక్రవర్ధన్ రెడ్డి, శివశంకర్, మీనాక్షి, రొద్దం నరసింహులు, సువర్ణ, భారతి, రామంజి, నరసింహమూర్తి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, ఉపాధి హామీ, భూగర్భ జలాలు, డిఆర్‌డిఎ, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, నేషనల్ హైవే, స్కిల్ డెవలప్మెంట్, బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ తదితర శాఖలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా దిశా కమిటీ ఛైర్మన్ పార్థసారథి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు అర్హులకు అందించేలా చూడాలన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా సురక్షితమైన తాగునీరు అందించాలన్నారు. యువతకు ఉపాధి చూపే చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మండలానికీ ఉపాధి హామీ నిధులను సమానంగా పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యానవన పంటలకు సంబంధించి జిల్లాలో టమోటో పంట అధికంగా పెడుతున్నారని హిందూపురం పార్లమెంటు పరిధిలో టమోటో ప్రాసెసింగ్ యూనిట్ ను నెలకొల్పటానికి కర్నాటకలోని కోలార్ ప్రాంతంలో ఉద్యాన, పరిశ్రమల శాఖ అధికారులు సంయుక్తంగా సందర్శించి సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక సమర్పించాలని దిశా ఛైర్మన్ కోరారు.

పారదర్శకంగా అభివృద్ధి పనులు : మంత్రి

మంత్రి సవితమ్మ మాట్లాడుతూ సంక్షేమ అభివద్ధి పనులను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ప్రతి పనికీ నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. రాష్ట్ర అభివద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో కషి చేస్తున్నారని అధికారులు ప్రజా ప్రతినిధులు అందరూ సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివద్ధి పథంలో నడిపించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్.రాజు మాట్లాడుతూ డిఆర్‌డిఎ ద్వారా అర్హులకు పింఛన్లు ఇవ్వాలన్నారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ గ్రామాలలో సుస్థిర ఆస్తులు సమకూర్చడమే లక్ష్యంతో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు అయిన నిధులను ఖర్చు చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీలు రమణారెడ్డి, చక్రవర్ధన్ రెడ్డి, ఎం.కవిత, ఆదినారాయణ యాదవ్ పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే

ఎస్‌ఇఆర్‌టి ప్రొఫెసర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

భావి భారత పౌరులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని ఎస్‌ఇఆర్‌టి ప్రొఫెసర్, పరిశీలకులు గంగిరెడ్డి తెలిపారు. హిందూపురం రూరల్ మండల పరిధిలోని బిట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఒకటి, రెండు తరగతుల బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ జరుగుతున్న ఐదవ విడత శిక్షణ తరగతులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గంగిరెడ్డి శిక్షణలోని అంశాలను బాగా తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వికసిత్ భారత్ ప్రచారకులు డాక్టర్ ప్రొఫెసర్ అజిత్ కుమార్, అకాడమిక్ ఇన్‌ఛార్జి బాబా ఫక్రుద్దీన్, హాస్టల్ ఇన్‌ఛార్జి నఫీసా సుల్తానా, డీఆర్పీలు, కేఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిలమత్తూరులో అరుదైన పిల్లి

ప్రజాశక్తి-చిలమత్తూరు

చిలమత్తూరు మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద అరుదైన పిల్లి కూన శనివారం కన్పించింది. కళాశాల పక్కనే అటవీ ప్రాంతం ఉండటంతో ఈ పిల్లి అక్కడి నుంచి వచ్చినట్లు తెలుస్తోంది. పిల్లి వయస్సు నెల ఉండొచ్చని అధ్యాపకులు అభిప్రాయ పడుతున్నారు. కొంతసేపటి తర్వాత తల్లి పిల్లికూనను నోటితో తీసుకెళ్లింది. ఇది పునుగు పిల్లిలా ఉందని దీనిని చూసిన వారు చెబుతున్నారు. ప్రభుత్వ కళాశాల ప్రాంతంలోని ఎర్రకొండ అటవీ ప్రాంతంలో ఇలాంటి అరుదైన జాతి పిల్లిలు ఉన్నాయని, వీటిని సంరక్షించే చర్యలను అటవీ శాఖ అధికారులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



అరుదైన పిల్లి పిల్ల

త్వరలో పేరూరు ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తాం

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

హంద్రీనీవా నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. పేరూరు ప్రాజెక్టు కమిటీకి శనివారం నిర్వహించిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. పేరూరు, మద్దెల చెరువు, గాండ్లపర్తి, తగరకుంట, పాలచర్లకు చెందిన సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు కలిసి పేరూరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను ఎన్నుకున్నారు. ఈ పదవులకు ఎలాంటి పోటీ లేకపోవడంతో ఏకగ్రీవమయ్యాయి. ఛైర్మన్‌గా కురుబ కోటే లక్ష్మీనారాయణరెడ్డి(పేరూరు), వైస్ ఛైర్మన్‌గా పెనకలపాటి లక్ష్మన్న(భోగినేపల్లి) ఎన్నికయ్యారు. దీంతో ఎన్నికల అధికారుల సమక్షంలో ఎమ్మెల్యే పరిటాల సునీత వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం రూ. 1.21 కోట్ల వ్యయంతో పేరూరు ప్రాజెక్టు గేట్ల మరమ్మతులను ఎమ్మెల్యే, నూతన కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పేరూరు ప్రాజెక్టుకు నీరు వచ్చినా కేవలం అలంకార ప్రాయంగా మార్చారన్నారు. కనీసం గేట్ల మరమ్మతులకు కూడా నిధులు ఇవ్వకపోవడం వల్ల నీరు వచ్చినా ఉపయోగం లేకుండా చేశారన్నారు. ఈ సారి కచ్చితంగా పేరూరు ప్రాజెక్టు పనులు పూర్తి చేసి హంద్రీనీవా నీటితో ప్రాజెక్టును నింపుతామన్నారు.

గేట్ల మరమ్మతులు ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత


పేరూరు ప్రాజెక్టు గేట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీత

అలాగే ప్రస్తుత ధరల ప్రకారం భూములకు పరిహారం ఇవ్వాల్సి ఉందని, దీనిపై సిఎం చంద్రబాబు కూడా సానుకూలత వ్యక్తం చేశారని తెలిపారు. రైతులకు పరిహారం ఇచ్చిన తర్వాతనే పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. పేరూరు ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు నీరిచ్చే రోజులు త్వరలోనే వస్తాయని తెలిపారు.

అర్హులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-కొత్తచెరువు

అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఈఎస్. వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సిపిఎం ఆధ్వర్యంలో ఇల్లు లేని నిరుపేదలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 6 నెలలైనా పేదల ఇళ్ల పట్టాల గురించి పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. గత వైసిపి ప్రభుత్వం జగనన్న కాలనీల్లో అర్హుల కంటే అనర్హులకే ఎక్కువగా ఇళ్లపట్టాలు ఇచ్చారని, వాటిపై విచారణ చేపట్టి అనర్హులను తొలగించి అర్హులకు అందజేయాలన్నారు. అలాగే ఎన్నికల హామీలను దశల వారీగా అమలు చేయాలని కోరారు. అనంతరం 70 మంది పేదలు డిప్యూటీ తహశీల్దార్ బాలాంజనేయులుకు అర్జీలు ఇచ్చారు.


తహశీల్దార్ కార్యాలయంలో బైఠాయించిన నిరుపేదలు

డిటి మాట్లాడుతూ 45 రోజుల్లోపు విచారణ నిర్వహించి అర్హులకు ఇళ్ల పట్టాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం పుట్టపర్తి ప్రాంతీయ కార్యదర్శి అంజి, వ్యకాస జిల్లా కోశాధికారి వెంకటేష్, సిపిఎం మండల కార్యదర్శి ముత్యాలు, ఐద్వా మహిళా ప్రధాన కార్యదర్శి నాగమణి, సిఐటియు మండల కో కన్వీనర్ శంకర్‌రెడ్డి, వెంకట్రాముడు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యాన శాఖ అధికారి లావణ్య తెలిపారు. ఆమె మాట్లాడుతూ పండ్ల తోటల రైతులు కోత అనంతరం క్లీనింగ్, గ్రేడింగ్, ప్యాకింగ్ చేసుకోవడానికి ప్యాక్ హౌస్ నిర్మాణానికి రూ. 2 లక్షలు, నీటి వనరుల పథకం ద్వారా ఫారం పాండ్ నిర్మాణానికి రూ. 75వేలు, కమ్యూనిటీ ఫారం పాండ్‌కు రూ. 20 లక్షల రాయితీ ఇస్తుందన్నారు. కొత్తగా పెట్టిన పండ్ల తోటలకు మూడేళ్ల వరకూ నిర్వహణ రాయితీ ఇస్తుందన్నారు. వివరాలకు సమీప రైతు సేవా కేంద్రం లేదా ఉద్యాన శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఆశా వర్కర్‌పై వేధింపులు తగదు

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని ఊటకూరు పిహెచ్‌సి పరిధిలోని పైడేటి గ్రామ ఆశా వర్కర్ గీతపై వేధింపులకు పాల్పడడం తగదని సిఐటియు నాయకులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆ పిహెచ్‌సి వద్ద ధర్నా చేపట్టారు. బాధితురాలు గీత మాట్లాడుతూ 15 రోజు లుగా ఎఎంఎల్ కవిత తేజస్విని దుర్భాషలాడుతూ పనిలో వేధింపులకు గురి చేస్తుందని వాపోయింది. ఈ విషయాన్ని పలుమార్లు వైద్యుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదన్నారు. సిఐటియు జిల్లా గౌరవాధ్యక్షులు సాంబశివ మాట్లాడుతూ ఆశా వర్కర్ గీతను వేధింపులకు గురి చేసిన కవిత తేజస్వినిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు, ఆశా వర్కర్స్ యూని యన్ జిల్లా అధ్యక్షురాలు త్రివేణి, సహాయ కార్యదర్శి రాధమ్మ, జిల్లా కమిటీ సభ్యులు వరలక్ష్మి, ఆశా వర్కర్స్ లలితమ్మ, గంగరత్నమ్మ, అశ్వర్థమ్మ పాల్గొన్నారు.


పిహెచ్‌సి ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా వర్కర్లు

పిహెచ్‌సి, అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్


పిహెచ్‌సిలో తనిఖీ చేస్తున్న ఇమ్మ్యునైజేషన్ అధికారులు

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం ఇమ్మ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేంద్రనాయక్, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ నివేదిత తనిఖీలు చేశారు. పుట్టపర్తి, యనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి రికార్డులు, ఆసుపత్రి పని తీరును పరిశీలించారు. పిహెచ్‌సి పరిధిలోని బ్రాహ్మణపల్లి, చిత్రావతి రోడ్డు, సాయినగర్‌లో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకా కార్యక్రమంపై ఆరా తీశారు. టీకా వేసే విధానంపై సూచనలు చేశారు. డాక్టర్ నివేదిత యనుములపల్లి అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యం, బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష కార్యక్రమంపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ జ్యోత్స్న, భవ్య, సామాజిక ఆరోగ్య అధికారి నగేష్ పాల్గొన్నారు.

వైసిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షునిగా గోవిందునాయక్

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలంలోని వెలిచలమల పంచాయతీ ఎస్‌కె.తండాకు చెందిన గోవిందునాయక్‌ని వైసిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా పార్టీ అధిష్టానం నియమించింది. దీంతో స్థానిక వైఎస్‌ఆర్ కూడలి వద్ద ఆ పార్టీ సీనియర్ నాయకులు ఆవుల బాలక్రిష్ణనాయుడు, మండల కన్వీనర్, ఎంపిటిసి కొత్త రంగారెడ్డి, వైస్ ఎంపిపి కేశవరెడ్డి ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి తిమ్మారెడ్డి, కోఆప్షన్ సభ్యులు సుబహాన్, ఉపసర్పంచులు సామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాయకులు తిరుమల నాయుడు, నారాయణస్వామి, రాఘవయ్య, ఆదినారాయణరెడ్డి, పుల్లారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, అస్లాం, బయా రెడ్డి, అల్లాబకాష్, ఆదెప్పనాయుడు, శేఖర్‌నాయుడు, అంజనప్పనాయుడు, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై డ్రిప్ పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి-అగళి

రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై మంజూరు చేసిన వ్యవసాయ డ్రిప్ పరికరాలను శనివారం మండలంలోని కోడిపల్లి, అర్జిపల్లి, మధూడి, బ్యాడిగెర గ్రామాల రైతులకు పంపిణీ చేసినట్లు కొథారి కంపెనీ ఎఫ్‌సిఒ దాదు తెలిపారు. ఆయన మాట్లాడుతూ బోరు బావి, విద్యుత్ సర్వీసు కలిగి ఉండి ఐదెకరాల లోపు రైతులకు 90 శాతం, ఐదెకరాల పైన ఉన్న వారికి 70 శాతం సబ్సిడీతో ప్రభుత్వం డ్రిప్ పరికరాలు అందిస్తుందన్నారు. అవసరమైన రైతులు ధ్రువీకరణ పత్రాలు, పూర్తి వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే అనంతరం డిడి చెల్లించిన 15 రోజుల్లోపు డ్రిప్ పరికరాలు పంపిణీ చేస్తామని తెలిపారు.

అర్హులందరికీ సొంతిళ్లు నిర్మిస్తాం : చిలకం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

అర్హులందరికీ సొంతిల్లు నిర్మించి ఇవ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరైన గృహాలను నిర్మించు కోలేని లబ్ధిదారులకు ఇప్పుడు నిర్మించి ఇస్తామన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో జనసేన, టిడిపి కార్యకర్తలను వేధించడంతో పాటు సంక్షేమ పథకాలను దూరం చేశారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఎక్కడా కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదని, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు.

జనసేన పార్టీలో చేరిక

బత్తలపల్లి మండలంలోని తంబాపురం గ్రామానికి చెందిన 15 కుటుంబాలు ఆ మండల అధ్యక్షులు పురంశెట్టి రవి, రమణారెడ్డి, సంజీవరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరగా వారికి చిలకం పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ మరింత బలోపేతం కావడానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. తాను అన్నివేళలా అందుబాటులో ఉంటూ ఏ ఆపద వచ్చినా ముందుంటానని హామీ ఇచ్చారు.


చిలకం సమక్షంలో జనసేనపార్టీలో చేరిన నాయకులు


సోలార్ విద్యుత్ గురించి వివరిస్తున్న ఏఈ

ఎస్సీ, ఎస్టీలకు సోలార్ విద్యుత్ ఉచితం

ప్రజాశక్తి-రొద్దం

సోలార్ విద్యుత్ ఎస్సీ, ఎస్టీలకు 3 కిలోవాట్స్ వరకూ ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌మూర్తి తెలిపారు. స్థానిక గ్యాస్ గోడౌన్ వద్ద శనివారం బుకింగ్ ప్రక్రియ ప్రారంభించగా 9 మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ సోలార్ విద్యుత్ 3 కిలో వాట్స్ కావాలంటే దాదాపు రూ. 60వేలు ఖర్చవుతుందని దానిని ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఇతర కులాల వారికి రూ. 30 వేలు రాయితీ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎల్‌ఎం షేక్షావలి, రామప్ప, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మానవ హక్కుల పరిరక్షణ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా శివప్ప

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్


బాపనపల్లి శివప్ప

జాతీయ మానవ హక్కుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా పుట్టపర్తి నివాసి బాపనపల్లి శివప్ప నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఫోరం సీఈవో శ్రీరామచంద్రనాయుడు నుంచి ఆయన నియామక ఉత్తర్వులు అందుకున్నారు. శివప్ప మాట్లాడుతూ తనకు జాతీయ మానవ హక్కుల పరిరక్షణ ఫోరం జిల్లా అధ్యక్షునిగా అవకాశం కల్పించిన సీఈఓకు, జాతీయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో మానవ హక్కుల పరిరక్షణకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. త్వరలో జిల్లాలోని అన్ని మండలాల్లో పర్యటించి మండల కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. మానవ హక్కులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.

'పరీక్ష పే చర్చ'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-బుక్కపట్నం

విద్యాపరమైన సమస్యల పరిష్కారానికి 'పరీక్ష పే చర్చ' ఒక వేదిక అని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఇందులో పాల్గొనేందుకు 6 నుంచి 12వ తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గుర్తింపు సంస్థల్లో బోధించే అధ్యాపకులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పరీక్షల వత్తిడిని తగ్గించడం, వినూత్న అభ్యసన పద్ధతులు, విద్యలో తల్లిదండ్రుల పాత్ర, తదితర అంశాలపై చర్చిస్తారన్నారు. ఎంపికైన వారికి ప్రధానమంత్రితో జరిగే చర్చలో పాల్గొని అవకాశం అభిస్తుందన్నారు. వివరాలకు ప్రిన్సిపల్ 99499 93712, లక్ష్మీనారాయణరెడ్డి 83280 12659, లక్ష్మీనారాయణ 94409 944737 సంప్రదించాలని తెలిపారు.

రేపు మంత్రి సత్యకుమార్ పర్యటన

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ నెల 23వ తేదీన ధర్మవరంలో పర్యటిస్తారని ఎన్‌డిఎ కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు తెలిపారు. మంత్రి ఉదయం 10 గంటలకు నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాంతీయ రవాణా కార్యాలయ ప్రారంభోత్సవం, 11:30 గంటలకు తుమ్మల గ్రామంలో వర్మి కంపోస్ట్ యూనిట్ ప్రారంభోత్సవం, మధ్యాహ్నం ధర్మవరం మున్సిపల్ కార్యాలయంలో జరిగే మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'జీవనజ్యోతి' విద్యార్థినులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఇటీవల కదిరిలో నిర్వహించిన జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో పట్టణంలోని జీవనజ్యోతి పాఠశాలకు చెందిన సి.షర్మిల, డి.సాహితి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం సిస్టర్ సుజాత తెలిపారు. ఎంపికైన విద్యార్థినులు ఈ నెల 22, 23తేదీల్లో నెల్లూరులో జరిగే 53వ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను హెచ్‌ఎం సిస్టర్ సుజాత, బోధన, బోధనేతర బృందం అభినందించారు.


విద్యార్థినులతో సి.షర్మిల, డి.సాహితి హెచ్‌ఎం సుజాత

విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి : మంత్రి

ప్రజాశక్తి-బుక్కపట్నం

విద్యారంగంలో సమూల ప్రక్షాళన కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తుందని బిసి సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను విద్యా రంగంలో ఆదర్శంగా నిలపడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మంత్రి శనివారం స్థానిక ఎంజెపి పాఠశాల, బిసి హాస్టల్‌ను సందర్శించారు. ముందుగా ఎంజెపి పాఠశాలకు వెళ్లి రికార్డులు, పరిసరాలు, మరుగు దొడ్లను పరిశీలించారు. దోమలు విపరీతంగా ఉండడంతో సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతి రోజూ ఫాగింగ్ చేసి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అనంతరం బిసి హాస్టల్‌కు వెళ్లి నిత్యావసర సరుకులను పరిశీలించారు. హాస్టల్‌లో అపరిశుభ్రత, స్టాక్ రిజిస్టర్ సరిగా లేకపోవడంతో వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో పరిశుభ్రత పాటించాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ వైసిపి హయాంలో విద్యా రంగాన్ని పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. ఆమె వెంట ఎంజెపి ప్రిన్సిపల్ రమాదేవి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, నాయకులు సామకోటి ఆదినారాయణ, జంగం వెంకటరాముడు, సుధీర్, మంజు, సూరి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.


ఎంజెపి పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న మంత్రి సవిత

క్రీస్తు బోధనలు మానవాళికి స్ఫూర్తిదాయకం

పుట్టపర్తి అర్బన్ : ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి స్ఫూర్తిదాయకమని మంత్రి సవిత తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె ఎంపి బికె.పార్థసారథి, జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్, మైనార్టీ కార్పొరేషన్ అధికారి రామసుబ్బారెడ్డితో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్‌కు రూ. 152 కోట్లు మంజూరు చేసిందన్నారు. క్రీస్తు సందేశాన్ని తెలిపి, అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు ఈటెల స్వామిదాస్, పాస్టర్లు సర్వేశ్వరరావు, శామ్యూల్, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పాల్గొన్నారు.

వైసిపి అధినేత జగన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ నివాసంలో శనివారం వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్. జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నియోజక వర్గంలోని గోరంట్ల, రొద్దం, పరిగి, సోమందేపల్లి, పెనుకొండ మండలాల నుంచి వైసిపి ప్రజాప్రతి నిధులు, ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. శంకరనారాయణ ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి గీతారామ్మోహన్‌రెడ్డి, వైస్ ఎంపిపి రామాంజనేయులు పాల్గొన్నారు.


పెనుకొండలో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి శంకరనారాయణ

మడకశిర రూరల్ : పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి ఈరలక్కప్ప, రాష్ట్ర వక్కలిగ కమిటీ అధ్యక్షులు రంగేగౌడ్, రాష్ట్ర కార్యదర్శి రవిశేఖర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మండలంలోని అమిదాలగొందిలో ఉన్న శ్రీవెంకటేశ్వర వృద్ధాశ్రమంలో వృద్ధులకు పాలు, పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కౌన్సిలర్లు జడ్పీటీసీలు ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

మలకవేములను మండల కేంద్రం చేయాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్

మలకవేములను మండల కేంద్రం చేయాలని జనసేన పార్టీ కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్, ఆ మండలంలోని పలువురు సర్పంచులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లాలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముదిగుబ్బ మండలం పరిపాలన పరంగా చాలా పెద్ద మండలమని, ఇందులో దాదాపు 27 పంచాయతీలు ఉన్నాయని, 44వేల ఓట్లు ఉన్నాయన్నారు. కొన్ని పల్లెలు మండల కేంద్రానికి చాలా దూరంగా ఉండటంతో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఈ పరిస్థితుల్లో ముదిగుబ్బను విభజించి మలకవేముల కేంద్రంగా మరో మండలం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయంపై త్వరలోనే కదిరి, ధర్మవరం, పుట్టపర్తి ఎమ్మెల్యేలను కలిసి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో భైరవ ప్రసాద్, తప్పెటవారిపల్లి, యర్రవంకపల్లి, కొండగట్టుపల్లి, సర్పంచులు మధుసూదన్, రజనీకాంత్‌రెడ్డి, పాపయ్య, నాయకులు రవీంద్రనాయుడు, రామాంజనేయులు, రఘునాథ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రామకృష్ణ, శ్రీనివాసులు, రమణ, ప్రకాష్, మురళీ, రామానాయక్, రాజేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న నాయకులు

నాయీ బ్రాహ్మణుల నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-కదిరి టౌన్

నాయీ బ్రాహ్మణుల కులవృత్తిలో చొరబాటుదారులకు అడ్డుకట్ట వేయాలని నాయీ బ్రాహ్మణుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ తరతరాలుగా కుల వృత్తినే నమ్ముకొని పట్టణంలో జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే ఇటీవల ఇతర కులస్తులు మోడరన్ సెలూన్ పేరుతో షోరూంలు ఏర్పాటు చేయాలని ప్రయత్నం చేస్తున్నారని, అవి వస్తే 800 కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కావున వాటికి అనుమతి ఇవ్వవద్దని ప్రజాప్రతినిధులు, అధికారులను కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆర్. హరి ప్రసాద్, ఇల్లూరు కృష్ణ, సంఘం కార్యదర్శి శివకుమార్, మోహన్‌గాంధీ, శ్రీనివాసులు, కృష్ణ, శివ, రామాంజనేయులు, ప్రసాద్, రామకృష్ణ, ఈశ్వర్, ఈశ్వర్‌బాబు, ఎం.వెంకటేష్, మధు, రమణ, తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

నూతన మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మార్కెట్ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. పట్టణంలోని తమ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ పుట్టపర్తిలో నిరసన కార్యక్రమం చేపట్టి, నూతన మార్కెట్ చట్టం జిరాక్స్ ప్రతులను దగ్ధం చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. అలాగే ఢిల్లీ సరిహద్దులో రైతు ఉద్యమ నాయకులపై కేంద్ర ప్రభుత్వ పాశవిక దాడిని తీవ్రంగా ఖండించారు. రైతులపై జరుగుతున్న దమనకాండను ఆపాలని, అరెస్ట్ చేసిన రైతులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘాల జిల్లా నాయకులు కదిరిప్ప, మారుతి, ఎస్‌హెచ్.బాషా, ఆదిరెడ్డి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఎపి రైతు సంఘం నేతలు

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని గూటిపల్లి గ్రామానికి చెందిన గిరీష్(31) ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. కుటుంబ సభ్యులు, ఎస్ఐ తెలిపిన వివరాలు.. గిరీష్ మద్యం తాగుడుకు బానిసై కుటుంబ పోషణ గురించి పట్టించుకోకుండా నిత్యం భార్యతో గొడవ పడివేదు. మూడు రోజుల క్రితం మద్యం తాగడానికి భార్య రమ్యను డబ్బులు అడగ్గా ఆమె ఇవ్వకపోవడంతో మరోమారు గొడవపడి శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. గిరీష్ తల్లి పద్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బత్తలపల్లి

అనంతపురం–కదిరి జాతీయ రహదారిపై మండలంలోని రామాపురం కూడలిలో బొలెరో వాహనం టైరు పేలి చోటుచేసుకున్న సంఘటనలో గాయపడిన ముత్యాలప్ప చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ధర్మవరం పట్టణానికి చెందిన చిదంబరం శుక్రవారం ముదిగుబ్బ నుంచి బొలెరోలో కట్టెలు లోడ్ చేసుకుని వెళ్తుండగా రామాపురం కూడలిలో టైరు పగిలి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆరుగురు గాయపడగా నాగులూరు గ్రామానికి చెందిన ముత్యాలప్ప పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం తరలించారు. ఆయన చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

కాలువలో పడి కాడెద్దులు మృతి

ప్రజాశక్తి-బుక్కపట్నం

ప్రమాదవశాత్తూ కాలువలో పడి కాడెద్దులు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని కొత్తకోట గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. వ్యవసాయ పనుల నిమిత్తం రైతు పక్కీరప్ప ఉదయం ఎద్దుల బండితో పొలానికి వెళ్తుండగా మార్గమధ్యలో బండి ఎద్దులు కాలువలోకి పడిపోవడంతో రెండు ఎద్దులు మృతి చెందాయి. దీంతో రూ. 2 లక్షలు నష్టపోయానని ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

విద్యుత్ వైర్లు తగిలి మరో ఎద్దు ..

లేపాక్షి : మండలంలోని బసవన్నపల్లి గ్రామంలో శనివారం రైతు ఆదిమూర్తి పొలం దున్నుతుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగిలి షాక్‌కు గురై ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాని, ఆ ఎద్దు విలువ రూ. 70వేలకు పైగా ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

హాస్టల్ నుంచి వెళ్లిపోయిన విద్యార్థి

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని వీవర్స్ కాలనీలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఉంటున్న పదో తరగతి విద్యార్థి పాల్తే జగదీష్ నాయక్ హాస్టల్ నుంచి వెళ్లిపోయాడు. తనకల్లు మండలంలోని రత్ననాయక్ తండాకు చెందిన యశోదమ్మ కుమారుడు జగదీష్ శుక్రవారం రాత్రి అమ్మమ్మతో ఫోన్‌లో మాట్లాడి నట్లు, ఆ తర్వాత తనకు చదువుకోవడం ఇష్టం లేదని హైదరాబాద్‌లోని అమ్మమ్మ వద్దకు వెళ్తానని స్నేహితులతో చెప్పినట్లు తెలుస్తోంది. శనివారం ఉదయం నుంచి జగదీష్ హాస్టల్‌లో కనిపించక పోవడంతో సిబ్బంది వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో హాస్టల్ వార్డెన్ జయరామిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. విద్యార్థి ఆచూకీ తెలిసినవారు సిఐ : 94407 96852, హాస్టల్ వార్డెన్ : 77807 32031 సమాచారం ఇవ్వాలని తెలిపారు.

పెను విషాదాలు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రమాదాలు అనేక మంది కుటుంబాల్లో పెను విషాదాలను నింపుతున్నాయి. ఈ వారంలో శనివారం తెల్లవారుజామునే జరిగిన రోడ్డు ప్రమాదంలో బంధువులైన చెందిన నలుగురు మృత్యువాత పడ్డారు. తిరుమల దర్శనానికి వెళ్లివస్తుండగా తెల్లవారుజామున వారు ప్రయాణిస్తున్న టెంపో ట్రావెలర్ ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రమాదంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అంతకు మునుపు నెలలో కూడా రోడ్డు ప్రమాదాలు పెద్దఎత్తున చోటు చేసుకోవడం గమనార్హం. గార్లదిన్నె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీలు మృతి చెందారు. వ్యవసాయ పనులు చూసుకుని స్వగ్రామానికి వెలుతుండగా జరిగిన ప్రమాదంలో కూలీలు చనిపోయారు. అది జరిగిన కొద్ది రోజుల్లోనే విడపనకల్లు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు డాక్టర్లు మృతి చెందారు. ఆటో ప్రమాదం మినహా పై రెండు ప్రమాదాలు తెల్లవారుజామున జరిగాయి. చలికాలం కావడంతో మంచు కప్పుకున్న సమయంలో ఎదురుగా రహదారి కనిపించగా ప్రమాదాలు జరిగినట్టు తెలుస్తోంది. సాధారణంగా కూడా రోడ్డు ప్రమాదాలు నవంబర్, డిశెంబర్ మాసా ల్లోనే అత్యధికంగా జరుగుతుంటాయని గణాంకాలు చెబుతున్నాయి. అది కూడా ఉదయం సమయంలోనే అత్యధికంగా జరుగుతున్నాయి. చలితోపాటు మంచు కప్పుకుని ఉండడంతో ఎదురుగానున్న వాహనాలు సరిగా కనిపించకపోవడంతోనే ఈ ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. జిల్లాలో రోడ్డు ప్రమాదాల రూపంలో సగటున ఏడాదికి 500 మంది దాక ఈ ప్రమాదాల్లో చనిపోతున్నారు. అప్రమత్తతే ప్రమాదాల నివారణకు మార్గమని అధికారులు సూచిస్తున్నారు. ఇక ఈ వారంలో యాడికి మండలం బోయరెడ్డి గ్రామంలోని ఆదాని పరిశ్రమలో చోటు చేసుకున్న ప్రమాదం చర్చనీయాం శమైంది. సిమెంటు పరిశ్రమలోని కోల్ యూనిట్‌లో నిప్పు కణికలు మీదపడటంతో ఐదుగురు కార్మికులు గాయపడ్డారు. ఇందులో ఒకరు చనిపోయారు. తక్కిన వారు గాయపడ్డారు. యాజమాన్యాలు సరైన భద్రతా చర్యలు పాటించకపోవడంతోనే ప్రమాదం జరిగిందన్న ఆరోపణలున్నాయి. ఇటువంటి ప్రమా దాలు జిల్లాలో పలు ఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం ఆదాని పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటనకు సంబంధించి వాస్తవాలను నిగ్గుతేల్చేం దుకు జిల్లా సేఫ్టీకమిటీకి అప్పగించారు. ఆ కమిటీ ఎటువంటి నివేదికను ఇవ్వనుందన్నది చూడాల్సి ఉంది.

ఈ వారంలో సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. ఎక్కడా ఎటువంటి ఘటనలూ చోటు చేసుకోకుండా సజావుగా జరగడంతో అందరూ ఊపిరి పిల్చుకున్నారు. డిస్ట్రిబ్యూటరీల ఎన్నికలు, శనివారం నాడు ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు పూర్తయ్యాయి. రైతాంగ సమస్యలపై వైసిపి ఈ వారంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించింది. అనంతరం కూడా అధికారులకు వినతిపత్రాలు అందజేసింది. అధికారపార్టీ నేతలు దీన్ని కొట్టిపడేశారు. అధికారంలో ఉండగా రైతాంగ సమస్యలను పట్టించుకోని వైసిపి ఇప్పుడు ఆందోళనలు చేయడాన్ని విమర్శించారు.

ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టాలి

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, పేర్ల తొలగింపులో ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించాలని ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ కన్నబాబు బిఎల్ఒలను ఆదేశించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను శనివారం ఆయన తనిఖీ చేశారు. నమోదైన క్లైమ్‌లను పరిశీలించారు. ఈ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో మహేష్, తహశీల్దార్ స్వర్ణలత, డిప్యూటీ తహశీల్దార్ షణ్ముఖ, కుమార్‌యాదవ్, బిఎల్ఒలు రాణాప్రతాప్, నరసింహులు, పవన్‌కుమార్, ముత్యాలప్ప, కంప్యూటర్ ఆపరేటర్ చక్రపాణి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి వితరణ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని ఐదు లాంతర్ల సర్కిల్‌లో నూతనంగా నిర్మించనున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి చిన్న పిల్లల వైద్య నిపుణులు వెంకటరమణ విరాళం అందించారు. రూ.51 వేలను ఆలయ కమిటీ ప్రతినిధులు జెఇ.వెంకటస్వామి, రాఘవేంద్రలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని దీక్ష

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

టిడిపి వ్యవస్థాపకులు, సినీనటుడు ఎన్టీ రామారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ఇవ్వాలని కోరుతూ పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు బిఎల్.నరసింహులు సంకల్పదీక్ష చేపట్టారు. శిబిరంలో శనివారం ఆయన మాట్లాడుతూ దీక్షను ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ 41 రోజులు పాటు చేస్తానని తెలిపారు. ఎన్టీఆర్ తెలుగు రాష్ట్రానికి చేసిన సేవలు, త్యాగాలు మరువలేనివని, కేంద్రం భారతరత్న ప్రకటించాలని కోరారు. దీక్షకు పలువురు మద్దతు పలికారు.

ఎస్పీ పిఆర్‌ఒకు సత్కారం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

విధి నిర్వహణలో అనేక ఒత్తిళ్లు ఉంటాయని, పోలీసులకు క్రీడా పోటీలు నిర్వహించాలని ఎస్పీ వి.రత్న నిర్ణయించడం మంచి పరిణామమని హిందూపురం జిల్లా జడ్జి శైలజ తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన క్రీడా పోటీలు విజయవంతం కావడంలో ఎస్పీ పిఆర్ఒ వెంకటేశ్ కృషిని జడ్జి శైలజ, ఎస్పీ రత్న అభినందించారు. అలాగే ఎస్పీ పిఆర్ఒ వెంకటేష్‌ను వారు శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు.

విద్యార్థులతో హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని భక్తరహల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవా లను వారం రోజుల పాటు ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు కర్నాటక, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వివిధ రూపాల్లో మొక్కుబడి తీర్చుకున్నారు. అయితే భక్తులు సమర్పించిన కానుకల హుండీలను పాఠశాల విద్యార్థులతో లెక్కించడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు హుండీ లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ రీజినల్ మీట్-2024లో పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ సురేష్‌బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకూ అనంతపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ నిర్వహించారు. అందులో ధర్మవరం విద్యార్థులు వాలీబాల్, బాడ్మింటన్, చెస్‌లో, 100, 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించారని తెలిపారు. వీరు జనవరి 28, 29, 30 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో



స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు

పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన అధ్యాపకులు రాజేష్, సహకరించిన అధ్యాపకులు హరిబాబు, జానకి, ఉమమహేశ్వరి, సుశీలను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-హిందూపురం

చట్టాలపై అవగాహన కల్పించడంలో భాగంగా శనివారం ఎస్‌డిజిఎస్, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీల ను శనివారం నిర్వహించారు. మండల న్యాయ సేవాధి కార సంస్థ ఛైర్మన్, అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ ఆధ్వర్యంలో ఆయా కళాశాలలో పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు చట్టాలు, న్యాయంపై అవగాహన కల్పించడం కోసం ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు బాల్య వివాహాలు, ర్యాగింగ్, మహిళల అక్రమ రవాణా తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు త్వరలోనే బహుమ తులు అందజేస్తారు. ఆయా పోటీలను ఎస్‌డిజిఎస్ ఎంబిఎ కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర కుమార్, హెచ్‌ఒడి



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

అనిల్, పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ హరీష్ బాబు, ఆంగ్ల ఉపన్యాసకురాలు హిమబిందు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, ప్రభుత్వం న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ న్యాయవాది కళావతిలు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సిబ్బంది శారద తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని నయారా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శనివారం జాతీయ గణిత దినోత్స వం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ గోపాల్‌నాయక్ హాజరై గణిత శాస్త్రం ప్రాముఖ్య తను విద్యార్థులకు వివరించారు. అనంతరం గణితశాస్త్ర పజిల్స్, క్విజ్‌లు, ఇంటరాక్టివ్ గేమ్‌లతో సహా వివిధ ఆకర్షణీయమైన కార్యక్రమాలు నిర్వహించారు. కరస్పాం డెంట్ శ్వేత, ప్రిన్సిపల్ మల్లికార్జున, వెంకటేష్ మాట్లాడు తూ విద్యార్థులు గణితంపై ఇష్టం పెంపొందించుకో



నయారా పాఠశాలలో గణిత దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

వాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రు లు, విద్యార్థులు, బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తర్వులను రద్దు చేయాలి

ఏఐడీఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి మహేష్

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యా మండలి పునర్వ్యవస్థీకరణలో భాగంగా నూతన విద్యా మండలిలో నారాయణ కళాశాల ప్రిన్సిపల్‌ను ఎంపిక చేస్తూ విడుదల చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని ఎఐడిఎస్ఒ రాష్ట్ర కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నారాయణ, చైతన్య తదితర కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యను వ్యాపారం చేస్తున్నాయని చెప్పారు. ఇలాంటి సమయంలో విద్యా సంస్థలతో సలహాలు తీసుకునే నెపంతో నారాయణ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపాళ్లను ఇంటర్ విద్యా మండలికి నామినేటెడ్ చేయడం దుర్మార్గం అన్నారు. తక్షణం ప్రభుత్వం దీనిపై పునరాలోచించి ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శు క్రవారం రాత్రి పట్టణంలోని గాంధీ నగర్, రైల్వేస్టేషన్ దగ్గర, ఆర్టీసీ బస్టాండ్, తదితర ప్రాంతాల్లో ఉన్న 30 మంది నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చలికాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న అనాథలు, యాచకులకు దాతల సహాయ సహకారాలతో దుప్పట్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో నలుగురు సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ వినియోగదారుల వారోత్సవాలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

రూరల్ మండలంలోని కుమ్మర వాండ్లపల్లి హై స్కూల్‌లో శనివారం కదిరి రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రెడ్స్ డైరెక్టర్ భానుజా, డిప్యూటీ తహశీల్దార్ ఈశ్వరప్రసాద్ హాజరై జాతీయ వినియోగదారుల చట్టాల గురించి తెలిపారు. వినియోగదారులు ఏ వస్తువు కొనుగోలు చేసినా తప్పనిసరిగా రశీదు పొందాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రెడ్స్ కోఆర్డినేటర్ ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయలో శనివారం పూర్వ విద్యార్థులు వైద్య శిబిరం ఏర్పాటు చేయించారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ ప్రదీప్తి, డాక్టర్ హరీష్, డాక్టర్ దేవేంద్రనాయక్, డాక్టర్ అభినయరెడ్డి విద్యార్థులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం బాస్కెట్‌బాల్, వాలీబాల్, క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేవారు. అనంతరం ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగరాజు, ఎఎజెన్ విఎల్ కోఆర్డినేటర్లు పద్మజ, నవీన్, శారద, జయశ్రీ, ప్రసాద్, సుజిత, ఫణి, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.



వికలాంగులకు వీల్ చైర్స్ అందజేస్తున్న ఆర్డీవో సువర్ణ

వికలాంగులకు వీల్‌చైర్స్ వితరణ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పట్టణానికి చెందిన సత్యసాయి బాబా భక్తురాలు నాగమ్మ సహకారంతో ఖిద్మత్ ఎ ఖల్క్ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి షామీర్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఇద్దరు వికలాంగులకు ఆర్డీవో సువర్ణ వీల్‌చైర్స్ అందజేశారు. ఆర్డీవో మాట్లాడుతూ మండలంలోని వెంగళమ్మ చెరువు గ్రామానికి చెందిన కళావతి, ఆమె చెల్లికి వీల్ ఛైర్స్ అందజేశామన్నారు. పేదలకు అండగా ఉంటున్న సంస్థ ప్రతినిధులను ఆర్డీవో అభినందించారు. కార్యక్రమంలో అలీ, రామాంజనేయులు, షమీఉల్లా, చాంద్, శశికుమార్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదులో కదిరి వాసి ఘనత

ప్రజాశక్తి-కదిరి టౌన్

టిడిపి సభ్యత్వ నమోదులో పట్టణంలోని నిజాంవలి కాలనీకి చెందిన మాజీ కౌన్సిలర్, టిడిపి నాయకులు అయూబ్ రాష్ట్ర స్థాయిలో 19వ స్థానం దక్కించుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టామన్నారు. ఈ క్రమంలో కదిరి నుంచి అధిక సంఖ్యలో సభ్యత్వాలు చేయించామన్నారు. ఈ గుర్తింపుతో తనపై మరింత బాధ్యత పెరిగిందని, మరిన్ని సభ్యత్వాలు చేయించేందుకు కృషి చేస్తానన్నారు.

నేడు పోటీ పరీక్ష

ప్రజాశక్తి-కొత్తచెరువు

స్థానిక వధాన్య సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ట్యాలెంట్ టెస్ట్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సొసైటీ అధ్యక్షుడు అశోక్ తెలిపారు. 7 పరీక్ష కేంద్రాల్లో జడ్పీ హైస్కూళ్లకు చెందిన 3వేల మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామన్నారు.

ధ్యానం చేద్దాం.. ఆరోగ్యంగా జీవిద్దాం..

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక శాంతి ఆనంద పాఠశాలలో ధ్యాన ముద్రలు వేసి ధ్యానం ఎలా చేయాలి వాటి ఫలితాలను వివరించారు. ఎంఇఒ వేమనారాయణ మాట్లాడుతూ ధ్యానం, యోగా ద్వారా ఒత్తిడిని జయించి ఆరోగ్యంగా, ప్రశాంతంగా జీవించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 రవణప్ప, హెచ్‌ఎం బొగ్గు రాజశేఖర్, సొసైటీ ప్రెసిడెంట్ తుమ్మల చంద్రమోహన్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాన్ని సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

విద్య, వైజ్ఞానిక పర్యటనలో భాగంగా స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు శనివారం మండలం లోని జగరాజుపల్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. నేటి సమాజంలో డిజిటల్, ఆన్‌లైన్ సేవలు అందించే విధానం, సచివాలయ సేవలు, కంప్యూటర్ పరిజ్ఞానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్‌బాబు, ఒకేషనల్ ట్రైనర్ నరేష్‌కుమార్, అధ్యాపక బృందం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

గ్రామాల్లో ప్రజలు గొడవలకు దూరంగా ప్రశాంత జీవనం గడపాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని కునుతూరు గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు పేకాట, మట్కా, కోడిపందెం, తదితర అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. వాటి జోలికి వెళ్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రజలు సహకరిస్తే నేరాలను అదుపు చేయవచ్చు అన్నారు. సైబర్ నేరాల పట్ల గ్రామస్తులకు అవగాహన కల్పించారు.



కునుతూరులో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు